నీళ్లు ఫుల్..చేపపిల్లల సరఫరా నిల్

- డిమాండ్‌కు సరిపడా చేపపిల్లల సరఫరాలో మత్స్యకార్మిక శాఖ విఫలం
- యాచారంలో ఉపాధిని కోల్పోతున్న ముదిరాజ్‌లు, మత్స్యకార్మికులు
- అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆందోళన



కుర్మిద్ద చెరువులో చేప పిల్లలను వదులుతున్న ముదిరాజులు (ఫైల్)

యాచారం: ఈ యేడాది సంవృద్ధి వర్షాలతో యాచారం మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండాయి. వర్షాలు తగ్గిపోయి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ కూడా చెరువులు, కుంటల నుంచి అలుగుల నుంచి వరద నీరు పారుతూనే ఉంది. యాచారం మండలంలోని పలు గ్రామాల్లో 20 చెరువులు, 12 కుంటలు ఉన్నాయి. తాడిపర్తి నుంచి నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, మల్కీజ్‌గూడ, తక్కళ్లపల్లి, చింతపట్ల, నల్లవెల్లి గ్రామాల మీదుగా గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి. ఒక్కో చెరువు 10ఎకరాల నుంచి 100 ఎకరాల విస్తీర్ణం మధ్యన ఉంటుంది. ప్రతి చెరువులో లక్షకు పైగానే చేపపిల్లల పెంపకం చేపట్టవచ్చు. చెరువులు, కుంటలు నిండడంతో యాచారం మండలంలోని ముదిరాజులు 10లక్షల చేపపిల్లలు రాయితీపై అందజేయాలని రెండు నెలల కిందే మత్స్యకార్మిక శాఖకు విజ్ఞప్తి చేశారు. కానీ మత్స్య కార్మికశాఖ మాత్రం ముదిరాజుల విజ్ఞప్తిని ఏమాత్రం పట్టించుకోలేదు. నక్కర్తమేడిపల్లిలో ఎక్వ చెరువు, ఊర చెరువు, చింతపట్లలోని లక్ష్మణ్ చెరువు, తక్కళ్లపల్లిలోని చెన్నరెడ్డి చెరువు, నల్లవెల్లిలోని నల్లవెల్లి చెరువు, తాడిపర్తిలోని బంధం చెరువుల్లో లక్షనుంచి రెండు లక్షల చేప పిల్లలు అవసరం ఉంటాయి. అయితే మత్స్యకార్మిక శాఖ మాత్రం ముదిరాజుల విజ్ఞప్తిని ఏ మాత్రం పట్టించుకోలేదు.

కేవలం 3లక్షల పిల్లలే సరఫరా

యాచారం మండలంలోని పలు గ్రామాల్లో 10 లక్షల చేప పిల్లలు రాయితీపై అందజేయాలని జిల్లా మత్స్య కార్మిక శాఖకు ముదిరాజ్ సంఘం విజ్ఞప్తి చేసింది. కానీ మత్స్యకార్మిక శాఖ మాత్రం రవ్వ, బొచ్చ తదితర రకాల చేపపిల్లలను కేవలం 3 లక్షలే సరఫరా చేసి చేతులు దులుపుకుంది. చేపపిల్లల్లో లక్షకు పైగానే మృతి చెందినవి సరఫరా అయ్యాయి. ఈ విషయమై మత్స్యకార్మిక శాఖపై ముదిరాజులు మండిపడుతున్నారు. సర్కార్ రాయితీపై కావాల్సిన చేపపిల్లలు సరఫరా చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడమే తప్ప క్షేత్రస్థాయిలో పంపిణీ శూన్యంగా ఉందని కార్మికులు అంటున్నారు. చేపల పెంపకంపై ఆధారపడి జీవనోపాధి పొందే దాదాపు 500కు పైగా కుటుంబాల్లో నిరాశే మిగిలింది.

ప్రైవేట్‌గా చేపపిల్లల కొనుగోలు

మత్స్యకార్మిక శాఖ డిమాండ్‌కు తగ్గట్టు చేపపిల్లలు సరఫరా చేయకపోవడంతో యాచారం మండలంలోని పలు గ్రామాల ముదిరాజులు అప్పులు చేసి చేపపిల్లలను కొనుగోలు చేశారు. నందివనపర్తి, కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి, నల్లవెల్లి, నానక్‌నగర్, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో ముదిరాజులు దాదాపు రూ.25 లక్షల చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువులు, కుంటల్లో వేసుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి లక్షలాది చేపపిల్లల పెంపకానికి అవకాశం ఉండగా డిమాండ్‌కు తగ్గట్టు చేప పిల్లలను సరఫరా చేయకపోవడం న్యాయం కాదని ముదిరాజులు అంటున్నారు. ఇంకా రూ.10 లక్షలకు పైగా చేప పిల్లలు కొనుగోలు చేద్దామన్నా దొరకని పరిస్థితి ఉంది.

అధికారులు పట్టించుకోవడం లేదు



వర్షాలు సంవృద్ధిగా కురిసి మా గ్రామంలోని పకిరోని చెరువు నిండి అలుగు పారింది. 50 వేలకు పైగానే చేపపిల్లల అవసరం ఉంటాయి. కానీ మా గ్రామానికి రాయితీపై చేపపిల్లలే సరఫరా చేయలేదు. గతంలో వేసిన చేపలే చెరువులో ఉన్నాయి. మత్స్యకార్మిక శాఖ నుంచి మాకు ఏమాత్రం ప్రోత్సాహం లేదు.

– మాదం జంగయ్య, మత్స్యకార్మికుడు, మొండిగౌరెల్లి

20వేల చేప పిల్లలు మృతి చెందాయి



మా గ్రామంలో చెరువులు, కుంటలు కలిసి 7 ఉంటాయి. మొత్తం 3 లక్షలకు పైగానే చేప పిల్లలు అవసరం ఉంటాయి. కాని మా గ్రామానికి మత్స్యకార్మిక శాఖ కేవలం 75 వేల పిల్లలనే పంపిణీ చేసింది. పంపిణీ చేసిన పిల్లల్లో 20 వేలకు పైగానే పిల్లలు మృతి చెంది వచ్చాయి. ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. చేపలు పంపిణీ చేయాలి.

– నీలం రవి, కుర్మిద్ద

ఉన్నతాధికారులతో మాట్లాడుతా..



సంవృద్ధి వర్షాలతో యాచారం మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి నేటికి అలుగు పారుతున్నాయి. మత్స్యకార్మికులు అడిగిన డిమాండ్ ప్రకారం చేప పిల్లలను సరఫరా చేయకపోవడం సరైంది కాదు, యాచారం మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులకు సొసైటీలుగా గుర్తించేలా కృషి చేయాలి. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాను.

– కొప్పు సుకన్య, ఎంపీపీ

ఆర్థికసాయం అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్: కవాడిపల్లి గ్రామానికి చెందిన బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు మూల వెంకటేష్‌గౌడ్ డిసెంబర్ 8న మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి సహకార సంఘం తరఫున అందించే రూ.25వేల ఆర్థిక సహాయాన్ని సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి మంగళవారం మృతుడి భార్య మంగమ్మకు అందజేశారు. డైరెక్టర్లు కందాడి మహిపాల్‌రెడ్డి, చేగూరి భరత్‌కుమార్, మేనేజర్ ఐలేష్‌యాదవ్, నాయకులు మూల నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నిధుల మంజూరు

ఆమనగల్లు: ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండల కేంద్రాల్లోని ఎమ్మార్సీ భవనాల మరమ్మతులకు రూ.10 లక్షలు మంజూరు అయినట్లు ఆమనగల్లు ఎంఈఓ సర్దార్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో భవనానికి రూ.2.5 లక్షల చొప్పున మంజూరు చేయడానికి కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అంగీకరించారని ఆయన చెప్పారు.

బకాయిలు సకాలంలో చెల్లించండి: పీఏసీఎస్

యాచారం: దీర్ఘకాలికం కింద రుణాలు పొందిన రైతులు మార్చి 25లోపే వాయిదాలు చెల్లించి, సంఘం ఆర్థిక బలోపేతానికి సహకరించాలని యాచారం పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్ రెడ్డి అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం సీఈఓ నాగరాజుతో కలిసి బకాయిలపై చర్చించారు. బకాయిలున్న రైతులకు త్వరలో నోటీసులు పంపించాలని నిర్ణయించారు. మార్చి 25 లోపే వాయిదాలు చెల్లించేలా రైతులు సహకరించాలని అన్నారు. త్వరలో గ్రామాలవారిగా బకాయిలున్న రైతులను కలిసి విజ్ఞప్తి చేస్తామని అన్నారు. యాచారం పీఏసీఎస్‌లో రూ.20 కోట్లకు పైగానే బకాయిలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్



విద్యార్థులకు పరీక్షప్యాడ్లు అందజేసిన నాయకులు

కడ్తాల్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోల రాఘవేందర్ అన్నారు. మండల కేంద్రంలో యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక కేజీబీవీ విద్యార్థులకు పరీక్షప్యాడ్స్, పెన్నులు అందజేశారు. ప్రతిఒక్కరూ సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, వివేకానంద యూత్ అధ్యక్షులు మాధవులు, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో సంక్రాంతి క్రీడోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ఇబ్రహీంపట్నం: ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, పీఎన్ఎం, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల నేతలు తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘాల నేతలు శంకర్, మస్కు చరణ్, జగన్, విజయ, ఉమా మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నంలో 8, 9, 10 తేదీల్లో ఈ క్రీడోత్సవాలను జరుపుతామన్నారు. వాలీబాల్, రంగోళి, టగ్ ఆఫ్ వార్ పోటీలుంటాయని.. ఆసక్తి గల వారు తమ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. నియోజకవర్గ యువత ఈ క్రీడలను విజయవంతం చేయాలని కోరారు.

మొగులయ్యకు సన్మానం



ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో మంగళవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగులయ్యను జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, నాయకులు వెంకటేష్, భాస్కర్, గణేశ్ నాయక్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వీరన్నపల్లికి చెందిన శ్రావ్యకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.34,500 సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు వెల్జాల్‌లో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమణి, లింగంగౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

11నుంచి మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఈనెల 11న ప్రారంభిస్తామని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన వారు మాత్రమే ఈ టోర్నీ లో పాల్గొనేందుకు అర్హులన్నారు. మొదటి బహుమతి రూ.55,556 అందజేస్తామన్నారు. ఈనెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈనెల 9న డ్రా తీస్తామన్నారు. బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు నిర్వాహకులుగా బండి చంటి, గోపాల్, భరత్, భగీరథ సాగర్, వివేకానంద, రాజశేఖర్, రవి, శివ వ్యవహరిస్తారన్నారు. పోటీలను బిగ్‌బ్యాట్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తామని తెలిపారు.

అందుబాటులో బూస్టర్ డోస్

మీర్‌పేట: కోవిడ్–19కు బూస్టర్ డోస్ టీకా బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉందని వైద్య సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవిషీల్డ్, కోవ్యాక్సిన్ మొదటి, రెండవ డోస్ తీసుకున్న వాళ్లకు బూస్టర్ (మూడవ డోస్)ను ఆసుపత్రిలో వేయనున్నట్లు తెలిపారు. మండలంలో రెండో డోస్ వేసుకున్న వారు ఆస్పత్రిలో బూస్టర్ డోస్ వేసుకోవాలని ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సూచించారు.

నిధులు దారి మళ్లిస్తున్నారు

జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి సర్పంచ్‌లను మోసం చేస్తోందని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో సర్పంచ్‌లు సేవ్యానాయక్, పోతుగంటి శంకర్, పాండునాయక్, రాములునాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల గ్రామ పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమవుతోందన్నారు. గ్రామాల అభివృద్ధి విషయంలో సీఎం ప్రకటనలకు, పోకడలకు పొంతన లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఇస్తున్న నిధుల ద్వారానే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గ్రామాల్లో చేపట్టిన పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, రైతువేదికలు, డంపింగ్‌యార్డులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల ద్వారానే నిర్మించారని చెప్పారు. పంచాయతీ పాలకవర్గాలు చేపట్టిన పనులకు నెలల తరబడి బిల్లులు అందకపోవడంతో సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. గ్రామ పంచాయతీల నిధుల మళ్లింపుపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేపడితే అడ్డుకోవడం దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన పంచాయతీల నిధులను తిరిగి గ్రామ పంచాయతీల ఖాతాల్లో వేసేవరకు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌ల పక్షాన పోరాటం సాగిస్తుందన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, రాంచందర్‌నాయక్, బీచ్యానాయక్, ఛత్రునాయక్ రాజేందర్ ఉన్నారు.

అవంతిలో ఆకట్టుకున్న ‘ఫ్రెషర్స్’ డే



వేడుకలను ప్రారంభిస్తున్న అవంతి శ్రీనివాసరావు





నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గుంతపల్లి గ్రామంలో గల అవంతి ఫార్మసీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం పెద్దఅంబర్‌పేటలోని క్లోం బాల్‌రెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు అవంతి విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే ముత్తెంశెట్టి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంకతో పాటు ముఖ్యఅతిథులుగా ఎన్ఐపీఈఆర్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.గణనాథం, గ్లోబల్ మెడికల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ఫౌండేషన్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ప్రసన్నలత, డిజైన్ ఎంటర్‌ప్రెన్యూర్ డాక్టర్ షర్మిలా నాగరాజ్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. వివిధ ప్రతిభా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్, డాక్టర్ కె.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ నిహార్‌రంజన్‌దాస్, హెచ్‌ఓడీలు రామకృష్ణ, పీఆర్ఓ శ్రీనివాస్‌నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ ఏడాదైనా మోక్షం కలిగేనా?



ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ కార్యాలయం

- నాలుగేళ్లుగా మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం ఖాళీ
- కొత్త పాలకవర్గం ఏర్పాటుపై ఆశావహులు ఎదురుచూపు
- మీనమేషాలు లెక్కిస్తున్న బీఆర్ఎస్ నేతలు, అధిష్టానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం ఖాళీ అయి నాలుగేండ్లు గడిచిపోయింది. నూతన కార్యవర్గం నియామకానికి ఇప్పటికీ మోక్షం కలుగలేదు. కొత్త సంవత్సరంలోనైనా ఈ పదవిని భర్తీ చేసి పాలకవర్గాన్ని నియమిస్తారని ఎన్నో ఆశలతో ఆశావాహులున్నారు. 2016 మే నెలలో తులేకలాన్ గ్రామానికి చెందిన సత్తు వెంకటరమణారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి 2018 వరకు కొనసాగారు. ఇక అప్పటినుంచి ఈ స్థానం ఖాళీగానే ఉంది. మార్కెట్ కమిటీ పాలకవర్గం నియమాకంలో తెలంగాణ సర్కార్ రిజర్వేషన్లు ప్రవేశపెట్టి కాల పరిమితిని తగ్గించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జనరల్ స్థానంలో ఉన్నప్పుడు సత్తు వెంకటరమణారెడ్డి ఆ పదవిలో కొనసాగారు. ఆ తదుపరి ఎస్సీలకు, బీసీలకు రిజర్వ్ అయ్యింది. వెంటనే చైర్మన్ పదవిని భర్తీ చేసి ఉంటే గడిచిన నాలుగేండ్ల కాలంలో ఎస్సీ, బీసీల టర్మ్‌కూడా పూర్తి అయ్యేది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండి, మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మార్కెట్ పాలకవర్గాన్ని నియమించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంతకు ముందు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన సత్తు వెంకటరమణారెడ్డికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవిని గత నెలలో కట్టబెట్టారు. అయితే మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమించకపోవడంపై సర్వత్రా చర్చ కొనసాగుతుంది.

సమర్థులే లేరా..?

ఈ పదవిని ఆశిస్తూ ఆశావాహులు ఎంతమంది ఉన్నా తన రాజకీయ అనుభవంతో వారిని ఏకతాటిపైకి తెచ్చి ఎవ్వరికో ఒకరికి చైర్మన్ పదవిని ఎమ్మెల్యే కట్టబెట్టి ఉంటే.. దళితుల విమర్శలకు చెక్ పడేదని పబ్లిక్ టాక్. మొదట్లో రాయపోల్ గ్రామానికి చెందిన మంఖాల దాసుకు చైర్మన్ పదవి వస్తుందని జోరుగా ప్రచారం సాగింది. ఎమ్మెల్యే తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఈ మేరకు మంఖాల దాసుకు హామీ ఇచ్చినట్లు జరిగిన ప్రచారానికి ఈ మధ్యన తెరపడింది. చిత్తాపూర్ గ్రామానికి చెందిన ఎర్పుల చంద్రయ్యకు చైర్మన్ పదవి వచ్చేసిందని, అధికారికంగా ఒకటిరెండురోజుల్లో ఉత్తర్వులు వస్తాయని గత నవంబర్, డిసెంబర్ నెలల్లో వార్తలొచ్చాయి. మరి ఏమైయిందో కానీ రెండు నెలలు కావస్తున్నా ఈ పదవికి సంబంధించిన ఎలాంటి ఉత్తర్వులు అధికారికంగా వెలువడకపోవడం శోచనీయం. ఇదిలావుంటే యేడాది క్రితం ఇబ్రహీంపట్నంకు చెందిన ఉద్యమ నాయకుడి రాజుకు ఈ పదవి దక్కుతుందని ప్రచారం చేశారు. ఇప్పుడు అతని ఊసే ఎత్తడంలేదు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీలో సమర్థులైన ఎస్సీలకు కొదవలేదు. మరెందుకో ఈ చైర్మన్ పదవిని భర్తీ చేయడానికి నాలుగేండ్లు గడిచినా ఒక నిర్ణయానికి రాలేని పరిస్థితి ఉండటం గమనార్హం. కొత్త సంవత్సరంలోనైనా కొత్త చైర్మన్‌ను మార్కెట్ కమిటీ పీఠంపై అధిష్టింపజేయాలని ఆశావాహులు కోరుతున్నారు.

విధుల్లో చేరిన వైద్యులు

మాడ్గుల: మండలంలోనిఇర్విన్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యుడిగా డా.ఆర్.రఘురాం నాయక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ వైద్యుడిగా విధులు నిర్వహించిన డా.శ్రీనివాస్ ఉన్నత చదువుల కోసం వెళ్లగా దేవరకొండలో విధులు నిర్వహిస్తున్న డా.రఘురాం నాయక్ బదిలీపై ఇర్విన్‌కు వచ్చారు.

ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రిలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఇద్దరు డాక్టర్లు విధుల్లో చేరారు. ఇంతవరకు ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిగా పనిచేసిన డా.అర్షద్ మేడ్చల్ జిల్లాలోని షామీర్‌పేట ప్రభుత్వాస్పత్రికి బదిలీ అయ్యారు. కాగా ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రికి డా.మంజుల, డా.మైమునబేగం నూతనంగా నియామకం కాగా మంగళవారం విధుల్లో చేరారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో జీఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో దివంగత వస్పుల ప్రకాశ్ స్మారక జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వస్పుల ప్రకాశ్ చిత్రపటానికి గోలి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనురాధ, ఆమనగల్లు సీఐ ఉపేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ గిరియాదవ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, నాయకులు రాము, రాజు, రమేశ్, సుభాష్, కమటం వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి సేవలు చిరస్మరణీయం

సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు, ఉపాధ్యాయులు సావిత్రిబాయి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. భారత దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. మహిళాభ్యున్నతి, చదువు కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

– సాక్షి, నెట్‌వర్క్



మంచాల: నివాళి అర్పిస్తున్న కేజీబీవీ సిబ్బంది, విద్యార్థులు



మాడ్గుల: మహిళా ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు



కడ్తాల్: సావిత్రిబాయి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఆమనగల్లు: నివాళి అర్పిస్తున్న బహుజన సంఘాల నాయకులు



ఇబ్రహీంపట్నం: నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



తలకొండపల్లి: రవీంద్రభారతిలో ఎంపీపీ నిర్మలను సన్మానిస్తున్న అతిథులు



తుర్కయంజాల్: సావిత్రిబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: కలెక్టరేట్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్‌ని మంగళవారం రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ యేడాది జిల్లాలోని ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట నాయకులు కొమురయ్య, అశోక్‌ముదిరాజ్, రాములుగౌడ్ ఉన్నారు.